
సాక్షి శ్రీకాకుళం

సోమవారం ; 13 ; మార్చి ; 2023



అన్నదాతకు అండగా..

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంటల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లు జరుగుతున్నాయి. - 8లో



చీపురుపుల్లలే జీవనోపాధి

చీపురుపుల్లలు చక్కటి ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. కొండపోడులో వీటిని సాగు చేస్తున్నారు. - 8లో

నేటి ఎస్పీ స్పందన రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖలో నేడు జరగాల్సిన స్పందన రద్దు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలు నేడు జరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని, వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

న్యూస్‌రీల్

అరసవల్లికి భక్తుల తాకిడి



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి ఆదిత్య క్షేత్రానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గర్భాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తమ ఆరోగ్యాల కోసం సూర్యనమస్కార పూజలను చేయించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వత్సవలస యాత్ర సందర్భంగా ఆదివారం సాయంత్రం కూడా భక్తులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ఆలయంలో సూర్యనమస్కార పూజలను చేయించుకున్నారు. ఆలయ పాలకమండలికి ఎంపికైన ఎస్.కోటేశ్వర చౌదరి కూడా స్వామిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.3,63,500, విరాళాల రూపంలో రూ.90,429, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

అడవిదుప్పి దాడిలో పారా మిలటరీ జవాను మృతి



లక్ష్మణ్(ఫైల్)

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం నర్సపురం పంచాయతీ ఆకులసతివానిపేట గ్రామానికి చెందిన పారామిలటరీ జవాన్ రొక్కం లక్ష్మణ్ (36) అడవి దుప్పి దాడిలో మృతి చెందారు. ప్రస్తుతం లక్ష్మణ్ భార్యపిల్లలు కోటబొమ్మాళిలోని విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అస్సాంలోని గుస్సాయిగాం పారామిలటరీ 31 బెటాలియన్‌లో సహస్రసీమాబల్ జవానుగా లక్ష్మణ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన విధి నిర్వహణలో ఉండగా అకస్మాత్తుగా ఆయనపై అడవి దుప్పి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అపస్మారక స్థితికి వెళ్లిపోయిన లక్ష్మణ్‌ను సహోద్యోగులు సమీప ఆస్పత్రిలో చేర్పించగా.. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. జవాన్ మృతదేహాన్ని అస్సాం నుంచి విశాఖపట్నం వరకూ విమానంపై తెచ్చి అక్కడ నుంచి మిలటరీకి చెందిన వ్యాన్‌లో కోటబొమ్మాళిలోని నివాసానికి ఆదివారం సాయంత్రం తీసుకువచ్చారు. కోటబొమ్మాళి తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్రపు డెక్కతో ఇబ్బందులు



నైరా చానెల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఆమదాలవలస రూరల్: మండలంలో చెవ్వాకులపేట గ్రామం సమీపంలో గల నైరా చానెల్‌లో(సాగునీటి ప్రధాన కాలువ) గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో భాగంగా ఆమదాలవలస మండలంలో చెవ్వాకులపేట, పొన్నాంపేట రామచంద్రాపురం, సరుబుజ్జిలి మండలంలో పురుషోత్తపురం, ఫకీర్‌సాహెబ్‌పేట, అల్మాజీపేట, శ్రీకాకుళం మండలంలోని నైర, పొన్నాం, బట్టేరు గ్రామాల్లో మొక్కజొన్న, రాగులు, అపరాలు, వరి, నువ్వుల పంటలను సుమారు 1500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంటలకు సాగునీరు అందించే నైరా చానెల్‌లో గుర్రపు డెక్క వల్ల సాగునీరు అందకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ఏటా ఖరీఫ్, రబీ పంటలకు ప్రధానంగా సాగునీరు అందించే 13.35 కిలోమీటర్ల మేర ఉన్న ఈ కాలువ పూడుకుపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో యంత్రాల ద్వారా గుర్రపు డెక్కను తొలగిస్తే రైతులకు కొంత మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత వంశధార జేఈ పి.కృష్ణ కిశోర్‌ను వివరణ కోరగా వచ్చే ఖరీఫ్ ముందు గుర్రపు డెక్కను తొలగించే ఏర్పాటు చేస్తామని అన్నారు. గుర్రపు డెక్క తొలగించడానికి కావాల్సిన నిధుల కోసం అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపామని, నిధులు విడుదలైతే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నేడే పోలింగ్



ఎచ్చెర్ల పాలిటెక్నిక్ కాలేజీలో బ్యాలెట్ బాక్సులు చెక్ చేసుకుంటున్న సిబ్బంది

- స్థానిక సంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికతో రాజకీయ హడావుడి
- పోలింగ్ కోసం భారీ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్





ఎచ్చెర్ల పాలిటెక్నిక్ కాలేజీలో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని చూసుకుంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పెద్దల సభకు ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీతో పాటు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి మరికాసేపట్లో పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష టీడీపీ, బీజేపీ, వామపక్షాలు గెలిచేందుకు తమ శక్తియుక్తులన్నీ ప్రదర్శించాయి. ఎత్తుకు పైఎత్తులతో ప్రచారం చేశాయి. వ్యూహ ప్రతివ్యూహాలతో రక్తికట్టించాయి. ఇప్పుడా అభ్యర్థుల భవితవ్యం తేల్చే రోజు వచ్చేసింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సమయం ఆసన్నమైంది. ఈ ఎన్నికల కోసం పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస ఆర్డీఓ కార్యాలయం, శ్రీకాకుళం పాలిటెక్నికల్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బంది తీసుకెళ్లారు. పోలీసు బందోబస్తు పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను కేంద్రాలకు తరలించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేశారు. గుర్తింపు కార్డు తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడమే మిగిలి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల కోసం 1000బ్యాలెట్ పేపర్లు రాగా, పట్టభద్రుల ఎన్నికల కోసం 57,433బ్యాలెట్ పేపర్లు జిల్లాకొచ్చాయి. వాటిలో రద్దు అయినవి తీసేసి పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించారు.. అవసరమైతే ఇచ్చేలా రిజర్వులో కొన్ని అందుబాటులో ఉంచారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి

పోటీలో ఉన్న అభ్యర్థులు : నర్తు రామారావు (వైఎస్సార్‌సీపీ), ఆనెపు రామకృష్ణ (ఇండిపెండెంట్)

ఓటర్ల సంఖ్య	776
డివిజన్‌ల వారీగా ఓట్లు	శ్రీకాకుళంలో 249, పాలకొండలో 153, టెక్కలిలో 162, పలాసలో 212
పోలింగ్ కేంద్రాలు	4
ఒక పోలింగ్ కేంద్రంలో అత్యధిక ఓటర్లు	249
ఒక పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు	153
ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు : శ్రీకాకుళం ఆర్డీఓ ఆఫీస్, పాలకొండ ఆర్డీఓ ఆఫీస్ మీటింగ్ హాల్, టెక్కలి ఆర్డీఓ ఆఫీస్, పలాస తహసీల్దార్ ఆఫీస్ మీటింగ్ హాల్	
పోలింగ్ ఆఫీసర్లు	28
రిజర్వు బ్యాలెట్ పేపర్లు	118
స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్ట్రాంగ్ రూమ్	పాలిటెక్నికల్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి..

పోటీలో ఉన్న అభ్యర్థులు	37 మంది

ప్రధాన అభ్యర్థులు: సీతంరాజు సుధాకర్ (వైఎస్సార్ సీపీ), పీవీఎన్ మాధవ్(బీజేపీ) కోరెడ్ల రమాప్రభ(పీడీఎస్), దుప్పలరవీంద్ర (ఇండిపెండెంట్), వేపాడ చిరంజీవులు(టీడీపీ), తదితరులు

పోలింగ్ కేంద్రాలు	59
జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య	52,256
శ్రీకాకుళం డివిజన్‌లో	29,631
టెక్కలి డివిజన్‌లో	11,103
పలాస డివిజన్‌లో	11,522

సర్వం సిద్ధం: కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థలు, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో పాలకొండ ఆర్డీఓ కార్యాలయం, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస ఆర్డీఓ కార్యాలయం, శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయాల్లో పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఓటర్లకు ఇప్పటికే ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలను తెలియజేసినట్లు స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు సంబంధించి జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి కొరత లేదన్నారు. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, ఎలక్షన్ కమిషన్ సూచనల ప్రకారం పోలింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. ఎవరికైనా ఓటరు స్లిప్పు అందకపోతే, తమ పోలింగు కేంద్రాన్ని తెలుసుకొని ఓటరు గుర్తింపు కార్డు తీసుకువెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

800 మంది పోలీసులతో బందోబస్తు



ఎన్నికల విధులపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ రాధిక


శ్రీకాకుళం క్రైమ్, ఎచ్చెర్ల క్యాంపస్: పోలింగ్ సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక జిల్లాలోని పోలీసు అధికారులకు సూచించారు. శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కాలేజీలో ఆదివారం ఆమె సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు అదనపు ఎస్పీలు, ముగ్గురు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, ప్రత్యేక దళాలు, ఆర్మ్‌డ్ పోలీసులు, స్పెషల్ పార్టీలు కలిపి మొత్తం 800 మంది బందోబస్తులో పాల్గొంటున్నట్లు తెలిపారు. కేంద్రాలకు వంద మీటర్ల వరకు బౌండరీ లైన్ వేసుకొని ఆ పరిధిలో గుంపులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నవారు రూట్ అధికారులు, మొబైల్ అధికారులతో పాటు ఇన్‌చార్జి అధికారుల ఫోన్ నంబర్లు తీసుకోవాలని, ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగిన తక్షణమే పోలీసు అధికారులకు తెలియజేసేలా వారికి ముందుగానే సూచించాలన్నారు. ఓటర్లకు మర్యాదనివ్వాలని, ఓటరు స్లిప్పు, ఒరిజినల్ గుర్తింపు కార్డులు పరిశీలించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ బూత్ లోపలకు వెళ్లకూడదన్నారు. పీఓ, ఏపీఓ అధికారులు పిలిస్తేనే లోపలికి వెళ్లాలని చెప్పారు.

జీడి పరిశ్రమ.. పల్లెకు వెళ్లెనమ్మా!

- పల్లెలకు విస్తరిస్తున్న జీడి పరిశ్రమలు
- కార్మికులకు పెరిగిన ఉపాధి అవకాశాలు
- ప్రస్తుతం 581 పరిశ్రమల్లో 40వేల మంది కార్మికులు
- 90శాతం మంది మహిళలకే పని



రంగోయిలో జీడి పరిశ్రమ



పలాస: పలాస కేంద్రంగా పురుడు పోసుకున్న జీడి పరిశ్రమలు నేడు పల్లెలకు కూడా విస్తరిస్తున్నాయి. ఈ విస్తరణ వేల మందికి ఉపాధి మార్గం చూపెడుతోంది. గతంలో పరిశ్రమలు ఉన్నచోటకే కార్మికులు అనేక వ్యయప్రయాసలను ఎదుర్కొని కాలినడకన వెళ్లేవారు. నేడు కార్మికుల ముంగిటకు పరిశ్రమలు తరలి వెళ్తున్నాయి. దీంతో పల్లె ఒడిలోనే కార్మికులు చక్కని ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో ప్రభుత్వం లెక్కల ప్రకారం 581 జీడి పరిశ్రమలు ప్రస్తుతం ఉన్నాయి. గతంలో పలాసలో కేవలం 90 పరిశ్రమలు మాత్రమే ఉండేవి.

మహిళలే అధికం

ఈ పరిశ్రమల్లో పనిచేయడానికి ఎంతో కష్టపడి మహిళా కార్మికులు వెళ్తుండేవారు. ప్రస్తుతం ప్రతి పల్లెలో కూడా నాలుగైదు షెడ్లు ఉన్నాయి. ఈ షెడ్లల్లోనే జీడి పరిశ్రమల్లో బాయిలింగ్ చేసిన పిక్కలను కటింగ్ చేసి జీడి పప్పును తీస్తున్నారు. జీడి పప్పును తీసిన తర్వాత వాటిపై పొట్టును కూడా ఈ కార్మికులే తొలగిస్తారు. ఇందుకు గాను ఒక కార్మికురాలికి కిలో జీడి పిక్కలు కటింగ్ చేస్తే రూ.27లు ఇస్తారు. ఈ విధంగా ప్రతి మహిళ రోజుకు కనీసం 20కిలోల పిక్కలను కటింగ్ చేస్తుంది. ఈ విధంగా రోజుకు సుమారు రూ.400లు సంపాదిస్తున్నారు.

ఒలిచిన జీడి పప్పునకు కూడా కిలోకు రూ.13లు చొప్పున పరిశ్రమదారులు ఇస్తారు. ప్రతి మహిళా కార్మికురాలు రోజుకి కనీసం 40కిలోల పప్పును ఒలుస్తారు. వీరు కూడా రూ.400లు పైచిలుకు సంపాదిస్తున్నారు. ఈ విధంగా గ్రామాల్లో మహిళలకు వారి సొంత ఊరిలోనే ఈ విధంగా కూలి పనులు లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాభై ఏళ్ల కిందట జరిగిన ఉద్యమాల కారణంగా ఏ పల్లెల నుంచి గ్రామీణులు దూరమయ్యారో నేడు అవే పల్లెల్లో జీడి పరిశ్రమలు వెలుస్తున్నాయి.



జీడి పప్పును ఒలుస్తున్న మహిళలు

గతంలో పలాస వెళ్లే దాన్ని



గతంలో జీడి పరిశ్రమలో పనిచేయడానికి పలాస వెళ్లేదాన్ని. ఉదయం వెళ్లి రాత్రి 7, 8గంటలకు ఇంటికి చేరేదాన్ని. అప్పుడు కూలి రేట్లు కూడా తక్కువ ఉండేవి. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఊరి దగ్గరే పనిదొరుకుతోంది. మా ఊరిలోని జీడి పిక్కల బడ్డీలో పనిచేస్తూ రోజుకు రూ.400లు సంపాదిస్తున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది. – నందేటి పద్మ, జీడి కార్మికురాలు, బొడ్డపాడు కాలనీ, పలాస మండలం

కూలి పెరుగుతోంది



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండేళ్లకు ఒక సారి కూలి రేట్లను పెంచుతున్నాం. గతంలో చాలా తక్కువగా ఉండేవి. ఇప్పుడు రేట్లు బాగున్నాయి. అత్యధికంగా 90శాతం మంది మహిళలే పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వారికి అన్ని రకాల సదుపాయాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నాం. పలాస నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాలతో కలుపుకుంటే సుమారు 40వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. – బొమ్మాళి తాతయ్య, కార్యదర్శి, పలాస కాష్యూలేబరు యూనియన్

కార్మికుల సహకారంతో..

కార్మికులతో మంచి సంబంధాలు ఉన్నాయి. వారి సహకారంతోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వారికి కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇ.ఎస్.ఐ, పి.ఎఫ్ చెల్లిస్తున్నాము. కాన్పులకు, కార్మికుల చనిపోయినప్పుడు తగిన ఆర్థిక సహకారం చేస్తున్నాం. ప్రతి రెండేళ్లకు ఒక సారి వేతనాల ఒప్పందం జరుగుతోంది. – మల్లా రామేశ్వరరావు, అధ్యక్షుడు, పలాస పారిశ్రామిక వాడ జీడి పరిశ్రమల సంక్షేమ సంఘం

విత్తన గుళికల తయారీతో రైతులకు మేలు



విత్తన గుళికల తయారీని చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పీఆర్పీ జి.వెంకటరమణ అన్నారు. మండలంలోని మహదేవిపురం గ్రామంలో ఆదివారం రైతులకు విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పించారు.

విత్తనాలు శుద్ధి చేసిన తర్వాత బంక మట్టి మొదటి పొరగా, ఘనజీవామృతం పొడి రెండో పొరగా, పొయ్యి బూడిద ఉపయోగించి విత్తన గుళికలు తయారు చేసి చూపించారు. వీటిని నీడలో ఆరబెట్టిన తర్వాత పొలంలో విత్తుకోవాలని రైతులకు వివరించారు. పొలంలో పదును లేకపోయినా వర్షం పడేంత వరకు విత్తనం అనేది పాడవకుండా ఉంటుందని, వర్షం పడ్డాక విత్తనం మొలకెత్తుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెంటయ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



కాశీబుగ్గ: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి అప్పలరాజు, పరిశీలకుడు సూర్యనారాయణరాజు



నరసన్నపేట: దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు

ప్రజా సంక్షేమమే జెండా.. అజెండా

మహానాయకుడి మహాభినిష్క్రమణం తర్వాత ఆయన మహోన్నత ఆశయాలను కొనసాగించడానికి ఓ జెండా పుట్టుకువచ్చింది. ఎన్నో ఆటుపోట్లు చూసిన ఆ జెండా ఇప్పుడు పేదవాడి గుండెగా మారింది. ప్రజా సంక్షేమమే నాయకుడి అజెండా అని చాటి చెప్పింది. వైఎస్ రాజశేఖర రెడ్డి ఊపిరి పోసిన పథకాలు చీకటిలో కలిసిపోకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సైనికుడిగా మారి ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. నీటిధార జీవనదిగా మారినట్టు పుష్కర కాల ప్రయాణంలో పార్టీ ఎంతో ఎదిగి సామాన్యుడి మనసులో శాశ్వతంగా చోటు సంపాదించుకుంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కిల్లి కృపారాణి

క్లుప్తంగా

విశేషాల సమాహారం వివేకచూడామణి


పులఖండం శ్రీనివాసరావును సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శంకరాచార్యులు రచించిన వివేక చూడామణిలో ఎన్నో గొప్ప విశేషాలు ఉన్నాయని గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం వివేక చూడామణిలోని పలు శ్లోకాలపై విశ్లేషణ ప్రసంగం జరిగింది. ప్రాణమయ, మనోమయ కోశాలు ఎంతో లోతైనవని చెప్పారు. కార్యక్రమంలో పి.పతంజలిశాస్త్రి, డాక్టర్ నిక్కు అప్పన్న, ఎం.మోహనరావు, నిష్టల నర్సింహమూర్తి, కె.తవుడు, ఎస్.వెంకటరావు, అనూరాధ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కోటి లింగేశ్వరాలయానికి రూ.1.34 కోట్ల వితరణ


దున్న గురుమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: చారిత్రక ప్రాధాన్యత కలిగిన బారువ కోటిలింగేశ్వర ఆలయం గర్భగుడి, అంతరాలయాన్ని పవిత్రమైన కృష్ణశిలతో నిర్మించేందుకు అవసరమైన రూ.1.34 కోట్ల నిధులను భరించేందుకు అదే గ్రామానికి చెందిన దున్న గురుమూర్తి దంపతులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో దాతను స్థానిక సర్పంచ్ యర్ర రజనీ, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలంగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న శివాలయం నిర్మాణ ఖర్చును భరించేందుకు గురుమూర్తి ముందుకురావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీనివాస్, ఎంపీటీసీ తామాడ విశ్వనాథం, మద్ది చంద్రశేఖర్, రాజేష్ ఖన్నా, గుర్రాల సత్యం, భువనేశ్వర్ ప్రసాద్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి


సెమినార్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

శ్రీకాకుళం: వైద్య విద్యలో నూతన టెక్నాలజీని విద్యార్థులు ఉపయోగించుకోవాలని రిమ్స్ హెడ్ ఆఫ్ ఎనస్తీషియాలజీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి(రిమ్స్) మెడికల్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనస్తీషియాలజీ ఆధ్వర్యంలో లాప్రోస్కోపిక్ సర్జరీలు, చెవి, ముక్కు గొంతు సర్జరీలలో ఆదివారం జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం నిరంతరం విద్యార్థులనే తలపిస్తుందన్నారు. వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు తెలుసుకోవాల్సిన అవసం ఉందన్నారు. అనస్థీషియా విభాగం ప్రొఫెసర్లు రంగనాథం, శిరీష, వైద్యులు బాను, అచ్యుతరావు, జాయింట్ కార్యదర్శి రంగనాథ్, ప్రసాద్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

అన్నదాతకు అండగా..!

- ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పంట సేకరణ కేంద్రాలు
- రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం
- రైతుల వాటా రూ.3.75 లక్షలే
- రైతు ఉత్పత్తిదార్ల సంఘాలకు యూనిట్లు పొందేందుకు అర్హత


పాతపట్నం మండలంలో సిద్ధమైన పంట సేకరణ కేంద్రం

కవిటి:

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్)తో పంట సేకరణ కేంద్రం(కలెక్షన్ సెంటర్) నిర్మాణానికి జిల్లా ఉద్యానశాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ)లుగా ఏర్పాటు చేయడం ద్వారా అన్నదాతలు సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులు సంఘటితంగా కలెక్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ఉద్యానశాఖ ద్వారా రూ.15 లక్షల నిధులు విడుదల చేయనుంది. ఇందులో 75 శాతం రాయితీ (రూ.11.25లక్షలు) ప్రభుత్వమే భరిస్తుంది. మిగిలిన రూ.3.75 లక్షల నిధులు రైతు సంఘాలు సమీకరించుకుని యూనిట్ నిర్మాణం చేయాలి.

ఇవీ ఉపయోగాలు..

- రైతులు తమ పంట ఉత్పత్తుల్ని ఈ కేంద్రాలలో నిల్వచేసుకోవాలన్నది ప్రధాన లక్ష్యం.
- ధరలు తగ్గుముఖం పట్టిన సందర్భాలలో ఇక్కడ పంట నిల్వచేసుకొని రైతులంతా సంఘటితంగా ఉంటూ దళారుల ప్రమేయం లేకుండా అమ్మకాలు చేయవచ్చు. అవసరమైతే వినియోగదారుడే ఈ సెంటర్‌కు వచ్చి తమకు నచ్చిన నాణ్యమైన పంటల్ని కొనుక్కోవచ్చు.
- జిల్లా వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులో ఉన్న నిధుల మేరకు 28 యూనిట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మంజూరు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయిలో విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- లింటల్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తిచేస్తే యూనిట్ ధరలో 50 శాతం నిధులు విడుదలచేస్తారు. నిర్మాణం ముగిసిన తర్వాత మిగిలిన 50 శాతం నిధులు అందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత ఆశయంతో ఉద్యాన శాఖ పంట సేకరణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌లో నిధుల సౌలభ్యాన్ని దృష్టిలోపెట్టుకుని 28 యూనిట్లు మంజూరు చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

– రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, శ్రీకాకుళం

అభివృద్ధిని రాజకీయ కోణంలో చూడొద్దు

- స్పీకర్ తమ్మినేని సీతారాం


మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాజకీయ కోణంలో కాకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి వాదాన్ని గుర్తెరిగి విజ్ఞులైన మేధావులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం కోరారు. ఆదివారం తన నివాసంలో స్పీకర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఓటరు విశాఖపట్నం రాజధానికి మద్దతుగా వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడిపడి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా విశాఖపట్నంలో రాజధాని ఏర్పాటు మనోగతాన్ని ఉత్తరాంధ్ర మేధావి వర్గం వెల్లడించినట్లు అవుతుందన్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు.. ఇలా ప్రతి వర్గానికి చెందిన వారు ఎన్నికల్లో క్రియాశీలక భూమిక వహించాలని కోరారు. స్థానిక సంస్థల అభ్యర్థిగా పార్టీ బలపరిచిన నర్తు రామారావును అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత స్థానిక సంస్థల ప్రతినిధులపై ఉందన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల ఎంపీటీసీలు, సర్పంచులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

గొర్రెల మృత్యువాతపై విచారణ


గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

సంతబొమ్మాళి: వ్యాక్సిన్ వికటించి 15 గొర్రెలు మృతి చెందిన విషయమై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. టెక్కలి పశుసంవర్ధకశాఖ ఏడీ రఘునాథ్, శ్రీకాకుళం ఏడీ కిషోర్‌లు ఆదివారం పాలతలగాం వెళ్లి మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి అప్పన్నకు చెందిన గొర్రెలకు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ స్రవంతి ఇచ్చిన షీప్ పాక్స్ వ్యాక్సిన్ మరొక వ్యక్తి వేయడంతో 15 గొర్రెలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. సిబ్బంది వ్యాక్సిన్ వేయకుండా యాజమానులకు ఇవ్వడంపై అధికారులు మండిపడ్డారు. అస్వస్థతకు గురైన గొర్రెలకు ఐదు రోజుల పాటు చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీ తెలిపారు. పోస్టుమార్టం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కాగా, 15 గొర్రెలు మృతి చెందడంతో సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

అపూర్వ సమ్మేళనం



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–83 మధ్య ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిసి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకొని అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు ప్రకాశరావు, తవిటయ్య, మోహనరావులను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మామిడి క్రాంతి, వి.వి.రాజు, నరేంద్ర, మాధవ తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని ఆదివారం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా లింగా స్వరగ గ్రామానికి చెందిన ముకుంద నాయక్, ఉద్రిపదర్ గ్రామానికి చెందిన భంబో మాలిక్‌లు కలిసి పోయిపడగడ గ్రామానికి చెందిన ఐబోరైతో వద్ద 25 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకుని ద్విచక్రవాహనంపై బయలుదేరారు. పాతపట్నం, హిరమండలం మీదుగా ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడలో ఉంటున్న రమోరైతోకు అమ్మాలని నిర్ణయించారు. పాతపట్నం సరిహద్దు చెక్‌పోస్టులో ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండటంతో వీరిద్దరూ పట్టుబడ్డారు. కార్యక్రమంలో వీఆర్వోలు బాలరాజు, పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ చోరీ



సీసీ టీవీ పుటేజీలో నమోదైన చోరీ దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని సాయిరాం మెడికల్ షాపునకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బద్రి మిన్నారావుకు చెందిన సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా దొంగిలించాడు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకొంది. ఓ వ్యక్తి మూగవాడినని చెప్పి కొన్ని కాగితాలను చూపిస్తూ కౌంటర్ మీద ఉన్న మొబైల్ ఫోన్‌ను ఆ కాగితాలు అడ్డుగా పెట్టుకొని దొంగిలించి అక్కడి నుంచి ఉడాయించాడు. కొంతసేపటి తర్వాత తన మొబైల్ పోయిందని గుర్తించిన మిన్నారావుకు ఏం జరిగిందో అర్థం కాలేదు. షాపులో ఉన్న సీసీ పుటేజీని పరిశీలించడంతో సదరు వ్యక్తే మొబైల్‌ను దొంగిలించిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే బయటకు వచ్చి చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి


నూకయ్య (ఫైల్)

గార: మండలంలోని కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలపల్లి నూకయ్య (72) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయమై ఎస్ఐ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

'చలో విజయవాడ' భగ్నం


కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు

కాశీబుగ్గ:

కాంగ్రెస్ పిలుపు మేరకు సోమవారం జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరేందుకు సిద్ధమైన పలాసకు చెందిన కాంగ్రెస్ నాయకులను కాశీబుగ్గ పోలీసులు నిలువరించారు. కాంగ్రెస్ నేతలు తంగుడు వీర్రాజు, టి. మధుసూదన్, మాదిన వెంకటరమణ, సాసుమాన శ్యామ్ తదితరులను సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో అదుపులోకి తీసుకుని కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అట్రాసిటీ కేసు నమోదు

నందిగాం: మండలంలోని రౌతుపురం గ్రామానికి చెందిన పోలాకి ఎర్రయ్యను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన శివరాంపురం గ్రామానికి చెందిన లండ రామారావుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. బాధితుడు ఎర్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి క్షేత్ర సహాయకునిగా పని చేస్తున్న ఎర్రయ్య నందిగాం కార్యాలయానికి వెళ్లేందుకు శుక్రవారం బైక్‌పై వస్తుండగా రౌతుపురం జగనన్న కాలనీ వద్ద రామారావు రోడ్డుకు అడ్డంగా బైక్ పెట్టి ఉన్నాడు. హారన్ కొట్టినా బైక్ తీయకపోవడంతో పక్కనుంచి వెళ్లిపోతుండగా హారన్ ఎందుకు కొట్టావని కులం పేరుతో తిట్టాడు. తననుఎందుకు తిడుతున్నావని అడగ్గా ఎర్రయ్యపై దాడికి పాల్పడి చెవి కొరకడంతో తీవ్ర రక్త స్రావమైంది. దీంతో ఎర్రయ్య టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నందిగాం ఎస్సై కేసు నమోదు చేశారు. బాధితున్ని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు పరామర్శించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

గడ్డివాము దగ్ధం


కాలిపోతున్న గడ్డికుప్ప

నందిగాం: మండలంలోని హరిదాసుపురంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కణితి జయరాం స్థానిక శివాలయం సమీపంలోని తన కల్లంలో పంట నూర్చి గడ్డికుప్ప వేశారు. సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో గడ్డికుప్ప కాలిబూడిదైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

తొమ్మిది మంది జూదరులపై కేసు

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని వాంబేకాలనీలో తొమ్మిది మంది పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 49,670 నగదును స్వాధీనం చేసుకుని అదుపులో తీసుకున్నామని, కేసు నమోదు చేశామని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు.

తమ్ముడిపై అన్న దాడి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 12వ వార్డు పల్లివీధికి చెందిన జోగి చంద్రశేఖర్‌పై అతని సోదరుడు జోగి మన్మధరావు ఇంటి విషయమై వచ్చిన తగాదాలో దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కింద అంతస్తులో తాను మరమ్మతులు చేయిస్తుంటే పైఅంతస్థులో ఉన్న అన్నయ్య తరచూ ఇబ్బందులు పెట్టేవాడని, గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా ఆదివారం దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కాగా, పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోగి చంద్రశేఖర్‌ను వార్డు కౌన్సిలర్ ఉమాహరిప్రసాద్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, టెక్కలిపట్నం సర్పంచ్ పానిల కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ బదకల పులిరాజు పరామర్శించారు.

విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెన



పెద్దపాడు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలో చదువుతున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఆదివారం కన్నవారి దీవెనలు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ యశోద లక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తల్లిదండ్రుల దీవెనలు పొందారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. – శ్రీకాకుళం రూరల్

చీపురుపుల్లలే జీవనోపాధి



- కొండపోడు పంటతో అదనపు ఆదాయం
- 16 గిరిజన మండలాల్లో చీపుర్ల సాగు

ఎల్.ఎన్.పేట: చీపురుపుల్లలు వేలాది మంది గిరిజన కుటుంబాలకు, వ్యాపారులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. అడవులు, కొండ పోడుల్లో సేకరించిన చీపురు పుల్లలే గిరిజన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గుర్తింపు పొందిన 20 గిరిజన మండలాల్లో సుమారు 2 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరంతా కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పంటలు, సహజ సిద్ధంగా లభించిన వివిధ రకాల ఉత్పత్తులను అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. అందులో చీపుర్లు కూడా జీవనోపాధి కల్పిస్తున్నాయి. చీపుర్లలో కొండచీపుర్లు, పూతిక చీపుర్లు అనే రకాలున్నాయి. ఒకప్పుడు పూతిక చీపుర్ల వినియోగం ఎక్కువగా ఉండేది. కొండ చీపుర్లు రాకతో పూతిక చీపుర్లు కనుమరుగైపోయాయి. గిరిజన మహిళలు కొండల్లో తిరిగి పూతిక చీపురుపుల్లలను సేకరిస్తారు. వీటిని ఇంటికి తీసుకుని వచ్చి ఎండబెడతారు. ఇలా ఎండిన పుల్లలను కట్టలుగా కట్టి విక్రయానికి తీసుకుని వెళ్తారు. పూతిక చీపురు కట్ట రూ.20కు అమ్ముతారు. వీటికి గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ గిరాకీ ఉంది. ఇక కొండ చీపురులను గిరిజనులు పోడు పంటగా నాటుతారు. సుమారు ఎనిమిది నెలలకు కొండ చీపురు పుల్లలు కోతకు వస్తాయి. కొండ చీపురు కట్టలు రూ.40 నుంచి రూ.50కు అమ్ముతున్నారు. గ్రామాల నుంచి పట్టణాల్లో ఉన్న చిన్న కిరాణా దుకాణం నుంచి పెద్దపెద్ద డిపార్ట్‌మెంట్ స్టోర్స్, మాల్స్ వంటి వ్యాపార సంస్థల్లోను కొండ చీపుర్లు అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి.

జిల్లాలోని సాగు మండలాలు

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 16 గిరిజన మండలాలు ఉన్నాయి. వీటిలో మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, ఎల్.ఎన్.పేట, హిరమండలం, సారవకోట, నందిగాం, మందస, బూర్జ, సరుబుజ్జిలి తదితర మండలాల్లో సుమారు 28వేల గిరిజన కుటుంబాల వారు పోడు పంటగా కొండ చీపుర్ల సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో కొండ చీపుర్లు సాగు చేస్తే సుమారు 2 వేల చీపురు కట్టలకు అవసరమయ్యే పుల్లల దిగుబడి వస్తాయి. కట్ట రూ.40కు విక్రయించుకున్నా రూ.80వేలు ఆదాయం వస్తుంది.

ఆర్థిక భరోసా



కొండ చీపుర్ల పంట గిరిజనులను ఆర్థికంగా ఆదుకుంటోంది. పంట సాగుకు పెట్టుబడి అక్కర్లేదు. దుంప నాటిన తర్వాత ఒకసారి కలుపు నివారణ చేపడితే పంట చేతికి వస్తుంది. దుంప ఐటీడీఏ రాయితీపై ఇస్తుంది. కొండ చీపుర్లు మార్కెట్ చేయలేక దళారులకు విక్రయించుకోవాల్సి వస్తోంది. – సవర గంగయ్య, గిరిజన రైతు, ముగడలోవ, ఎల్.ఎన్.పేట


పూతిక చీపురు పుల్లలు సేకరిస్తున్న గిరిజన మహిళ